# ఉన్మాది

శ్రీ నలినీకాంతరావు

'రాజా'కి

"ఇది నేను ప్రత్యహం పడుతూన్న బాధ. తెలిసో, తెలియకో పదిమందీ పడుతూన్న బాధ. పడునైన ప్రతిమనిషీ తప్పకుండా పడే బాధ. ఇది మబ్బుగా, చీకటిగా, మందమందంగా తోచే మాయబాధ. మన మనఃక్షణమూ — ఎరిగీ, ఎరగకా — అనుభవిస్తూన్న వింత వేదన. అర్థంకాని అగాధ వ్యాకులత. ఒకజాడ్యం — ఊఁహూఁ — ఒక విదాహం, వెఱ్ఱి ఆకలి. ఎముకలు పిప్పిచేసే తీవ్రవాంఛ, ఆవురావురుమనే భీకర అసంతృప్తి. బ్రతుకంతా బావురుమనే పెద్దఖాళీ...

దీన్ని ఉత్తి ఉన్మాదంకింద తీసిపారెయ్యకండి —

జీవిత మంతా ఒక్కవిధంగా వేధించే ఈ మహాబాధ ఆఖరి కర్థమైంది. ఒక సృష్టి రహస్యం అమాంతంగా కరతలామలక మైపోయింది. మనది మొదలూ — చివరా లేని ఒకటే ఒంటరితనం! ఈ ఏకాంతం తప్పించుకోడానికే మనం పడే పాట్లన్నీ, చేసేపనులన్నీ.

నేను భయంకరమైన ఏకాకిత్వంలో బ్రతుకుతున్నా! ఈ వాస్తవం తెల్లమైంది మొదలు పీడిస్తూన్న పాడుబాధ కొన్నాళ్లు సహించాను; దీని నేదీ తుదముట్టించలేదని నాకు తెలుసు. ఏదీ! — వింటున్నారా? ఎంతతంటాలుపడ్డా, ఏంచేసినా; ఎంత బాధపడ్డా; ఎలాంటి ముద్దుపెట్టినా, ఎంతగట్టిగా కౌగలించినా — మన మెప్పుడూ ఒంటిగాళ్లమే! ప్రాణం తినేసే ప్రత్యేకభావమే!

ఇల్లంటే చెప్పరానిబెంగ, పెద్దభయం. బావురుమంటూన్న ఇంట్లో ఉండలేక, ఇకడికీ అకడికీ వెళ్లిపోతుంటాను — ఇప్పుడు మీతో మాట్లాడుతున్నా. మీరు వింటున్నారు. ఏం లాభ మంటాను? ఉభయులం ఏకతంగానే ఉన్నాం. ఒకరిపక్క నొకరముండీ ఎడంగానే ఉన్నాం... తెలిసిందా?

కల్లబొల్లిసుకాల్లో కళ్లు మూసుకొని కలలు కనడం నాచేత కాలేదు. ఈ ఒంటరి వ్యసనం దాపరించింది. బుజాలరాపిడి మినహా ఇతరసంపర్కం లేకుండా, అంతులేని ఒంటిపాటు నవగతం చేసికొన్నా ననే గర్వమైన తృప్తివినా వేరు సంతోషం ఎరగకుండా ... వెఱ్ఱెత్తినట్టు తిరుగుతున్నా నీ ప్రపంచంలో.

నా కొంచెం మతి చెడిందని మొహమొహాలు చూసుకొంటున్నారు, అవునా?

ఇలా వినండి. ఈ దిక్కుమాలి సవస్థ ప్రాప్తించింది లగాయతు, అంచూ దరీ తెలీకుండా అలా ఆనాటి కానాడు ఏదో అంధకారకూపంలో అడుగడుక్కీ దిగబడిపోతున్నట్టు బాధపడతా. చుట్టుపక్కల నెవరూ లేకుండా, నాలా విషాదయాత్ర సాగిస్తూన్న మరోజీవి తోడు లేకుండా ఇలా ఒక్కణ్ణే కుంగిపోతున్నా. ఈకూపం -జీవితం. ఒక్కొక్కప్పుడేవో సందళ్లు, ఏవేవో కంఠాలు, అరుపులూ వినిపించి ఆ గందరగోళంకేసి వెడతా. కాని, ఎక్కడినుంచి ఒచ్చిందో ఆగోల ఎప్పుడూ సరిగ్గా తెలియలేదు. ఒకళ్లూ తారసిల్లరు; ఆవరించిన ఈ కారుచీకట్లో ఇం కెవరూ కనిపించరు; "మన మందరం ఎడారిలో ఉన్నాం: పరస్పరం అర్థం కాము."—

అంతే- ఎవరూ ఎవ్వరికీ అర్థంకారు. ఎంత చెప్పినా, తల బ్రద్దలు చేసికొన్నా, ఎన్ని తిప్పలు పడ్డా. కొన్నిటి మిన్కుమిన్కుమనే కాంతి తప్ప వేరేమీ కనబడనంత దూరంలో విశాలాకాశంలో అగ్నికణాల్లా రుప్పిన ఆనక్షత్ర సముదాయంలో ఏం జరుగుతోందో భూమ్మీదివాళ్ల కేంతెలుసు? ఆ అనంతపథంలో అంతర్హితమైపోయిన మిగతా కోటానుకోట్ల సంగతి ఏం చెప్పగలం? మాట్లాడరేం?—

మరొకనిలో ఏముందో మనిషికూడా అంతమాత్రమే గ్రహిస్తున్నాడు. నక్షత్రం నక్షత్రంకంటె పరస్పరం మన మెక్కువ దూరంలో ఉన్నాం. మన ఒంటిపాటు పదిరెట్లు - వెయ్యిరెట్లు అధికం. తలపోత లోతు తెలియలేం కనక. మన మర్థం చేసికోలేని మనుష్యులతో ఈ నిత్య సంపర్కంకంటే ఘోరమైన దేముంది?

చాచినచేతుల్తో - చేరడంమాత్ర మెన్నడూ లేకుండా ఎంతో దగ్గరివాళ్లంలాగ, కలిపి కట్టేసిసట్టుగా, ఒండొరులం ప్రేమించుకుంటాం. ఐక్యంకోసం ప్రారికే ఇదయిపోడం చాలా ఇబ్బంది కలిగిస్తుంది. కాని, మనశ్రమలన్నీ వృథా, ప్రాకులాట నిరుపయోగం, నమ్మకాలు వ్యర్థం, కౌగలింతలు పని చెయ్యవు. కలియాలని ఉద్రూత లప్పాగేసరికి మన ఆకస్మిక మనోవికారాలు మధ్య నిల్చి మనల్ని డీకొనచేస్తాయి....

ఏ స్నేహితునికో ఈహృదయం విప్పి చెప్పేటపుడే ఎక్కడలేని ఒంటరితనం నన్ను బాధిస్తుంది. అప్పుడే దాటరాని ఈ అడ్డంకి బాగా బోధపడుతుంది. నామిత్రుడు పక్కనే ఉన్నాడు. అతని తేటకళ్లు నాపైని ప్రసరిస్తున్నాయి. కాని, కాని - కదిలే ఆకళ్ల వెనక మెదులుతూన్న ఆత్మమాత్రం దృగ్గోచరం కాదు. హుఁ. నే చెబుతూన్నది వింటాడు. ఏమనుకుంటున్నాడో?— ఈయాతన మీకర్థం కాదు. నన్ను ద్వేషిస్తున్నాడో, నిరసిస్తున్నాడో, వెక్కిరిస్తున్నాడో? నే నన్నది విమర్శించి నన్నతిసామాన్యునిగానో, ఒట్టి తెలివిమాలినవానినిగానో జమకడతాడనుకొంటాను. ఏం?- అసలు వినడమే లేదేమో? అతని ఆలోచన లెలాగ తెలుసుకోడం? నే

నతన్ని ప్రేమించినట్టుగా నన్నూ ప్రేమిస్తున్నాడో లేదో కనుక్కోడ మెలాగ ? ఆ చిన్నతలకాయలో ఏముందో ? అబ్బా, అంతా అయోమయం! విశదపడని మనిషి ఆలోచన - నిగూఢం, స్వతంత్రమైన ఆలోచన - ప్రాణాంతకమైన ఆలోచన ఎంతమిస్టరీ! దీని నాకళించాలేం, అదుపులో పెట్టాలేం; శాసించాలేం, సాధించనూలేం.

ఇంక నేను! - నా జీవనసర్వస్వం సమర్పించుకుందామనీ, నా ఆత్మద్వారాలన్నీ తెరిచి పెట్టేదామనీ ఎంతో, ఎంతో ఉబలాటపడతా. చూడగా - నే నింకా ఆ అగాధంలోనే- అట్టడుగున - ఇతరులు ప్రవేశింప శక్యంకాని నా రహస్యవాసంలోనే దిగబడిపోయాను. దాని నెవరూ కనిపెట్టలేరు, చొరలేరు. నన్నుపోలినవా ళ్లుండటం దుర్లభం ఒకరినొకరు గ్రహించడం దుర్ఘటం...

మీాకైనా ఇపు డర్థమయా ననుకొంటా — లేదు ! వీడికి మతిపోయిం దనుకుంటున్నారు. పరిశీలనగా పరికిస్తున్నారు. పరికించి వెరగుపడుతున్నారు. 'ఇంతట్లోకి ఏ మొచ్చిందని' తెల్లబోయి చూస్తున్నారు. ఒద్దు! కాని, ఏనాఁడైనా దారుణం, దుర్గ్రాహ్యమైన నా ఆవేదన, నా ఆరాటం ఇంత గ్రహించగలిగినట్టయితే, నాదగ్గిరి కొచ్చి 'నిన్ను తెలుసుకొన్నా మోయ్ !' అనండి చాలు. చాలు: ఒకనిమిషమైనా రవంత శాంతి కల్పిస్తారు.........స్త్రీలమూలంగా నా ఒంటరి బ్రతుకు, నా దిక్కుమాలినస్థితి మరింత ఘోరంగా తెలిసిపోయింది. అబ్బబ్బా! స్త్రీలనుంచి యమయాతన పడిపోయాను. పురుషుల్నిమించి స్త్రీలే నే నొంటరిని కాననే వెర్రిభ్రమ కలగచేశారు.— ప్రేమావిష్టునికి తా నేదో విశ్వమంతా విరిసిపోతోన్నట్టు, మహదానంద మేదో తన్ను చుట్టుకొన్నట్టు వెర్రిగా ఉంటుంది. ఎందుచేతనో కనిపెట్టారా? ఇంకేం కాదు; — తా నింక ఏకాకిని కానని భావిస్తాడు. ఒంటిపాటు, అసహాయత్వము అంతరించినట్టు కనిపిస్తాయి. ఎంత పొరపాటు !

దీర్ఘకేశాలతో, మోహనరూపంతో, ప్రణయవీక్షణాలతో మురిపించే వ్యక్తిముందర వెళ్లబుచ్చినగడియ లెంత మధురమధురమో మీాకు చెప్పనవసరంలేదు. ఆ ఉద్రేకంలో, విభ్రాంతిలో, ఆబుద్ధిమాంద్యంలో—అపుడే ఆత్మలు రెండూ ఏకమైపోతా యనిపిస్తుంది. అంతే. ఆ 'అపుడే'మాత్రం ఎప్పుడూ రాదు. వారాలతరబడిని అలా వెర్రిఆసతో, నమ్మడానికి వీల్లేని ఉత్సాహంలో ఉండుండి చివరికోనాడు పూర్వంకన్నా ఎక్కువ ఒంటరిగా ఉన్నట్టు తెలుసుకుంటాం. ప్రతీముద్దుచివరా, ప్రతీకౌగలింతతరవాతా, ఈ దిక్కుమాలిన బాధ ఎక్కువౌతుంది. ఎంత దారుణంగా బాధపడతాం!

అగమ్యగోచరమైన ఆ అన్యోన్యభావంలో అభిప్రాయాలు - ఆశలు పూర్తిగా కలిసిపోయి ఆమె అంతరాంతరం అవగాహనై పోతోం దని తోచే ఆ ముహూర్తంలోనే

ఒక్కమాట, ఒకేమాట హఠాత్తుగా మన కళ్లు తెరుస్తుంది, మధ్యనున్న భయంకర అఖాతం మెరుపులా చూపెడుతుంది... ఐనా, — మన ప్రియురాలిదగ్గిర — ఉబికి పోయే ఆ భావోద్రేకంలోనే అంత హాయీ కంటూ - కిక్కురు మనకుండా ఒకరాత్రి గడపడంలాంటి మహాదృష్టం ఇంకోటిలేదు. ఈప్రపంచంలో! — అంతకంటె ఎక్కువడ గొద్దు - ఇంతవర కేరెండుప్రాణులు ఒకటి కాలేదు!

నామట్టుకు ఆత్మ మూసి కూర్చున్నానిపుడు. నానమ్మకాలు, ఇష్టాలు, ఆలోచనలు ఇతరులతో చర్చించడము మానేశాను. ఒంటిగా బ్రతకడం మన ప్రారబ్ధమని బోధపడింది మొదలు నామనోభావాలన్నీ మరుగు పరిచాను. ఉద్దేశాలతోటి, నమ్మకాలతోటి —వాదనలతో నాకేమవసరం? ఎవ్వరితోనూ కూడలేక తొలగి అందరికీ దూరంగా ఉండిపోయాను. అదృశ్యమైన నా ఆత్మ గుట్టుగానే ఉండిపోయింది. దినమూ ఎదుర్కొనే ప్రశ్నలకి మామూలు జవాబులు నోరు కదపడానికే ఇష్టం కానపుడు - చెవివారనే చిరునవ్వు జాగ్రత్తపెట్టాను.—

అర్థమౌతోందా? అలా చూస్తున్నారేం ఇదంతా నిషామహత్యమనుకుంటున్నారా, ఉన్మాదంకింద తోసిపారేస్తున్నారా? బుద్ధిశాలి నని బుర్ర లాడిస్తున్నారా, బోధపడక తెల్లబోతున్నారా?"

---

# నా గుట్టు

‘పరాశర’

వేపించు లోకంపు విసపు దృష్టులు తొలగ
వేగిరించే వలపు విధమంత లో నణచి
అతి గుట్టుగా బరువు బ్రతుకు ఈడ్చుచునుండ,
వెలిబుచ్చినది నన్ను వాడఃవారిన మోము.
‘భావనా లోకంపు బడబానలము నిన్ను
బాధించునా’యనుచు పరిహాసించెను జనము.

---